రెండు
మనస్తత్వాలతో
బ్రతికిన అతను
ఎప్పుడు మారాడు?

# మనిషిలో మనిషి

కప్పగంతుల
మల్లికార్జున
రావు కథ

దొడ్లో చెంబు చప్పుడయితే ఉలిక్కిపడి లేచింది సరస్వతి. గోడకున్న ద్వాపరయుగంనాటి గడియారంలో మూడున్నర దాటింది.

పక్కనున్న రాంబాబు వొళ్లు పట్టుకుని చూచింది. మాడిపోతోంది. వాడికి మూడు రోజులుగా జ్వరం. వాడికి ఆమెకు కూడా గంట క్రితం కాస్తంత నిద్ర పట్టింది.

వొళ్లు తుడుచుకుంటూ దొడ్లోంచి వచ్చాడు పద్మనాభం.

''మీరా! దొంగనుకుని హడలి చచ్చాను''

''దొంగా! మనింటికి రావడానికి ఏ గజదొంగకు గుండె వుందే?''

పద్మనాభం భార్యదగ్గర గొప్పలు ప్రదర్శించడానికి అవకాశం వస్తే వదలడు.

''అయినా మనింట్లో దరిద్రం తప్ప ఏముంది కనుక లెండి దొంగలు పడడానికి?''


పద్మనాభం అద్దాన్ని చేతుల్లోకి తీసుకుని విభూతి రేఖలతో మొహాన్ని అలంకరించుకున్నాడు.

''ఈవేళ తెల్లారక ముందే బయలుదేరేరే! పిల్లవాడికి మూడు రోజులుగా జ్వరం అండీ''

''మందిచ్చానుగదా? ఇవాళకూడా ఆ మాత్రలే వేయి. తగ్గిపోతుంది'' పంచె కట్టుకుంటూ దర్జాగా అన్నాడు పద్మనాభం.

''నాకేదో భయంగా వుందండీ. మీ చక్కెర మాత్రలు పనిచేయడంలేదు. పట్నం తీసుకెళ్లి డాక్టరుకు చూపిద్దాం. ఎలాగూ బయల్దేరారుగా?''

''చాలా బాగా చెప్పేవే ఇల్లాలా? ఊళ్లో అందరికీ నేను వైద్యం చేస్తాను. వాళ్ల జబ్బులు నేనిచ్చే మాత్రలకే తగ్గుతాయి. నా కొడుకును మాత్రం నేను పట్టణానికి తీసుకెళ్లి డాక్టర్లకు చూపించాలి. ఇక రేపటినుంచి నేను ఊళ్లో తలెత్తుకుని తిరగాలా? రాగిచెంబు పట్టుకు తిరగాలా?''



పద్మనాభానిది వానాకాలం చదువు. ఊళ్లో పెద్దలిచ్చిపోయిన చిన్న ఇల్లు వుంది. జానాబెత్తెడు భూమి వుంది. అతనికి ఏ పనీ చేతకాదు. కానీ తను మహా మేధావినని అతని అభిప్రాయం. అడక్కుండానే అతను అందరికీ సలహాలిస్తాడు.

బ్రతకడానికి అతను ఎన్నో వేషాలు వేస్తాడు.

మంత్రాలు రాకపోయినా మెళ్లో జంధ్యం పోచలతో, మొహాన విభూతి రేకలతో అతనే ఆ

ఒక్కడయ్యాడు.

అతనెప్పుడో హోమియోపతిని గురించి చిన్న పుస్తకం చదివేడు. అందులో చెప్పిన కొన్ని మందుల్ని కొనుక్కొచ్చాడు.

అందులో ఒక మందు ఊళ్లో ఎవరికో ఇస్తే అది పనిచేసింది. రోగం తగ్గిన వ్యక్తి ప్రచారంవల్ల అతను డాక్టరయి కూర్చున్నాడు.

పద్మనాభానికి దూరం చుట్టం ఒకడు పట్నంలో పెద్ద ప్లీడరు దగ్గర గుమాస్తా.

ఏదో సందర్భంలో పద్మనాభానికి కొత్త వ్యవహారాలు చెప్పేడతను.

''ఒరేయ్ పద్దాయ్. కోర్టు వ్యవహారాలు తెలుసుకోడానికి ప్లీడరు కానక్కర్లేదు. చదువులు చదవక్కర్లేదు. పదిరోజులపాటు కోర్టులచుట్టూ తిరిగితే లాలూ, గీలూ అన్నీ నీకే వంటపడ్తాయి. ప్లీడర్ల గోత్రాలు, జడ్జీల గోత్రాలు వంటబడ్తాయి. మా లాయరుకు నేనెంత చెప్తే అంత. చాలా మంది జడ్జీలు నా సలహా అడిగి జడ్జిమెంట్లు ఇచ్చారు. తె ?''

ఆ మాటలన్నీ నిజమనుకుని పద్మనాభం దరోజులు కోర్టులచుట్టూ తిరిగేడు. ఒక్క షయం అంతుబట్టలేదు. అయినా కోర్టుల విషయాలన్నీ తనకే తెల్సినట్టు మాట్లాడడం మాత్రం నేర్చుకున్నాడు.

ఊళ్లో ఇద్దరు తన్నుకుంటే ప్రత్యక్షమవుతాడు. లా పాయింట్లంటూ ఏమో మాట్లాడి పెద్దరికం చేస్తుంటాడు.

ఇవన్నీ ఊళ్లో అందరికీ తెల్సిన విషయాలే. కానీ అతడిని గురించి భార్యకు కూడా తెలియని విషయం ఒకటి వుంది.

''పోనీ ఇవాళ్టికి మీరు ఇంట్లోనే వుండిపోకూడదూ?''

ఎందుకు?

''రాంబాబుకేమన్నా అవుతే...''

''ఏమవుతుంది''

''ఏమో...''

పద్మనాభం బిగ్గరగా నవ్వాడు.

''ఓసి నీ.... ఇది పద్మనాభం ఇల్లే. వాడు పద్మనాభం కొడుకు. దొంగలకేకాదు, సాక్షాత్తు ఆ యమధర్మరాజుక్కూడా ఈ పద్మనాభం అంటే హడల్. నా ఇంటి దరిదాపులక్కూడా రాడు. తెల్సా? నేనింక అర్జంటుగా వెళ్లాలి'

'ఎక్కడికి?' అడగాలనుకుంది సరస్వతి.

కానీ ఆ రహస్యం పద్మనాభం ఎవరికీ చెప్పడు.

త్రేతాయుగంనాటి బ్రేకుల్లేని సైకిల్ ఎక్కి పట్నంవైపు దూసుకుపోయేడు పద్మనాభం.

★ ★ ★

న్యూస్ పేపర్ల కట్టలు వేన్‌నుంచి అప్పుడే దిగేయి.

జనం పేపరుకోసం ఎగబడ్డారు. గరం గరం పచ్చిమిరపకాయ బజ్జీల్లా న్యూస్‌పేపర్లు అమ్ముడుపోతున్నాయి.

అందుకు కారణం?

ఆరోజు ఇంటర్ పరీక్షాఫలితాలు ప్రకటించారు. వెళ్లి జేబులోంచి ఒక కాగితం తీశాడు.

ఆ కాగితంలో కొన్ని నెంబర్లున్నాయి. ఆ నెంబర్ల పక్కన అభ్యర్థుల పేర్లు, వివరాలున్నాయి.

ఆ వివరాలన్నీ వాళ్ల గ్రామంలో ఇంటర్ పరీక్ష రాసినవాళ్లవి.

వాళ్లు పరీక్ష రాసిన కాలేజీలో గుమాస్తాను పట్టుకుని ఆ వివరాలన్నీ పరీక్ష కాగానే రాసుకుని పెట్టుకున్నాడు. ఈ విషయం ఎవరికీ తెలియదు.

న్యూస్ పేపరు చూసి ఆ పేపర్లకు ఎదుర్గా ఎవరు పాసయిందీ ఎవరు ఫెయిల్ అయిందీ

రాసుకున్నాడు.

అతడికి కడుపు నిండినట్లయింది.

ఊళ్లోని పదిమంది విద్యార్థులు పరీక్ష రాస్తే అందులో పాసయింది ఒక్కడే. ఆ ఒక్కడుకూడా దొంగ ఎల్లమంద కొడుకు.

డబ్బున్న రెడ్లపిల్లలు, చౌదరీల పిల్లలు, నాయుళ్ల పిల్లలు, అంతా ఫెయిల్ అయ్యారు. అతని మనసుకు బ్రేకుల్లేకుండా అయిపోంది. ఆనందంతో పొంగింది. సైకిలెక్కి ఉత్సాహంతో గ్రామంవైపు దూసుకుపోయాడు.

★ ★ ★

''అయ్యా రెడ్డిగారూ ఒక శుభవార్త''

తెల్లవారకముందే పిలవా పట్టెకుండా వచ్చిన పద్మనాభాన్ని చూచి గతుక్కుమన్నాడు పెద్దరెడ్డి.

అలా పిలవకుండానే పద్మనాభం ఎవరిళ్లకో వెళ్లిన సందర్భాలు చాలా గుర్తుకొచ్చాయి పెద్దరెడ్డికి. ఒక్క ఇంటికీ మంచి జరుగలేదు. అన్నీ దుర్వార్తలే. బాధలే.

పెద్దరెడ్డికి చదువు లేకపోయినా లోకజ్ఞానం చాలా వుంది. బుద్ధిచాతుర్యం వుంది.

'చిన్నరెడ్డిగారి పరీక్షా ఫలితాలు వచ్చాయండీ. ఇంటర్ పరీక్షలు రాసెడుకదా? తెల్లవారుజామున పట్నం వెళ్తే పేపరు కన్పించింది. ఒకటి కొనుక్కుని ఇంటికొచ్చాను. అబ్బాయిగారిని పిలిపించండి''

పరీక్షా ఫలితాలు వచ్చాయనగానే నిద్రపోతున్న చిన్నరెడ్డి నెత్తిమీద నీళ్లు గుమ్మరించినట్లయి అమాంతం లేచాడు.

'అబ్బాయిగారు పరీక్ష పాసయే వుంటారు. అట్లా ఇట్లా కాదు. ఫస్టుక్లాసులో. పెద్దరెడ్డిగారి కొడుకంటే పరీక్షలకూ భయమే'

చిన్నరెడ్డి వచ్చేసరికి పద్మనాభం తండ్రీకొడుకుల్ని జాయింట్‌గా పొగుడుతున్నాడు. పెద్దరెడ్డి గర్వంగా వింటున్నాడు.

భయం వేసింది చిన్నరెడ్డికి.

నిజానికతను క్లాసులకు ఎప్పుడూ పోలేదు. అయితే పరీక్ష మాత్రం తండ్రి పరువు నిలపడానికి పాస్ కావాలనుకున్నాడు. ఎప్పుడు? రేపు పరీక్షనగా ఇవాళ?

అంచేత ముందు బెంచీలో, పక్క బెంచీలో, వెనుకబెంచీల్లో కూర్చున్నవాళ్ల ఆన్సర్లను కాపీకొట్టేడు.

అందులో ఏవి రైటో, ఏవి తప్పో అతనికి

## నగ్నం

''మీరు ఒక పాటలో నగ్నంగా నటించారు ఎందుకని?'' హీరోయిన్‌ను అడిగాడు.

''నేను నటించలేదండి. కలలో హీరో నన్ను అలా ఊహించుకుంటాడు'' చెప్పింది.

- డి. క్రిస్టఫర్‌బాబు (మణుగూరు)



వాళ్లు పాసయితే అతనూ పాసవుతాడు. తప్పదు.

'పరీక్ష ఫలితాలొచ్చాయట! నీ నెంబరు చెప్పరా'

చిన్నరెడ్డి చెప్పేడు. తననెంబరుకాదు. ముందు బెంచీవాడి నెంబరు. ఫెయిల్.

'చిన్నరెడ్డిగారూ ఇది మీ పక్కవాడి నెంబరనుకుంటాను. మీరు ఫెయిల్‌కారు. మీ నెంబరు చెప్పండి' ఉబ్బగొట్టేడు పద్మనాభం.

పక్కవాడి నెంబరు, వెనుకవాడి నెంబరుకూడా చెప్పాడు. రెండూ ఫెయిలే.

'అబ్బాయిగారూ. ఇక మీ నెంబరు ఏమిటో నేను చెప్తాను' అంటూ పద్మనాభం చిన్నరెడ్డి నెంబరు చెప్పాడు. కరెక్టుగా అదే నెంబరు.

కానీ ఆ నెంబరూ ఫెయిలే!

చిన్నరెడ్డి తల వంచుకుని ఏడవసాగాడు. పెద్దరెడ్డి తల ఎత్తి వేమూరి గగ్గయ్యలా అరవసాగాడు. అప్పటికే పక్క ఇళ్ల జనం అక్కడ మూగేరు.

'పెద్దరెడ్డిగారూ. మీరు కాస్త శాంతించాలి. చిన్నరెడ్డిగారు పాసయ్యే వుంటారు. పేపరువాళ్లే ఏదో పొరపాటు చేసి వుంటారు'' అంటూ పద్మనాభం శాంత పరచబోయాడు. శాంత పర్చేకొద్దీ రెచ్చిపోయాడు పెద్దరెడ్డి.

''చిన్నరెడ్డిగారూ, ఏడవకండి. వెధవ పరీక్ష. మార్చిపోతే సెప్టెంబరు వుంది. సెప్టెంబరు పోతే మార్చి వుంది. ఈ రెంటికి మధ్య ఇన్‌స్టెంట్ అని ఏదో ఇంకోటికూడా వున్నట్టు గుర్తు. పరీక్ష పోతే ఏడుస్తారా ఎవరైనా? ఛీఛీ.. ఊరుకోండి'' ఊరడించేకొద్దీ ఏడిచాడు చిన్నరెడ్డి. పరీక్ష పోయినందుకుకాదు. పాసయ్యేవాడి నెంబరు చెప్పనందుకు. తండ్రి తిడ్తున్నందుకు.

అలా పద్మనాభం తొమ్మిదిళ్లలో ఆనందాన్నిస్తాన్న [illegible] రాత్రి బాగా పొద్దుపోయేక ఇల్లుచేరి హాయిగా నిద్రపోయాడు.

అవతల వాళ్లను ఏడిపించి, ఏడుస్తుంటే ఊరడించడం అతనికి భలే సరదా. ఆ సరదాయే అతని బలహీనత.

★ ★ ★

మర్నాడు పొద్దుపోయి లేచాడు పద్మనాభం.

లేవగానే సైకిలెక్కి పక్కన ఇరవై మైళ్ల దూరంలో వున్న ఒక ఊరికి బయలుదేరాడు.

ఆ ఊళ్లో ఆరోజు ఒకడు చావాలి. ఆ వార్తను మోసుకొచ్చి ఈ ఊళ్లో వాళ్లకు చెప్పి వాళ్లు ఏడుస్తుంటే ఊరడించాలి.

కానీ ఆరోజు అతని కష్టం ఫలించలేదు.

ఛస్తాడనుకున్నవాడు గుండ్రాయిలా లేచి కూర్చున్నాడు.

ఉసూరుమనుకుంటూ చీకటి పడేవేళకి ఇల్లు చేరకున్నాడు.

ఇల్లు తాళం వేసి వుంది.

'రాంబాబుకి ప్రాణం మీదికొచ్చింది. సరస్వతి బిడ్డను పట్నం తీసుకుని వెళ్లి హాస్పిటల్‌లో చేర్చింది' పక్కింటివాళ్లు చెప్పారు.

'ఏ హాస్పిటల్?'

సైకిలేసుకుని ఆ హాస్పిటల్‌కు చేరుకున్నాడు.

ఆ హాస్పిటల్ ఐదుద నక్షత్రాల హోటల్‌లాగా వుంది. సరస్వతి రాంబాబును ఆ హాస్పిటల్‌లో చేర్పించిందంటే నమ్మలేకపోయాడు.

తీరా ఇన్‌టెన్సివ్ కేర్ యూనిట్‌లో భార్యను పిల్లవాడిని చూచాక నమ్మక తప్పలేదు.

ఆ కేర్ యూనిట్ ... అక్కడి పరికరాలు... గదులు... అతనికి భయమేసింది.

''రాంబాబును ఇక్కడకు ఎలా చేర్చావ్? ఎందుకు చేర్చావ్?''

''ఛీ పిల్లవాడికలా వుంటే అదంత

ముఖ్యమా?''

భార్య మాటలకు మొదటిసారిగా సిగ్గుపడ్డాడు.

పిల్లవాడు మన లోకంలో లేడు. రాత్రి గడిస్తేగానీ చెప్పలేమన్నారు డాక్టర్లు. ఆ రాత్రంతా బిడ్డతోపాటు సరస్వతి ఇన్‌టెన్సివ్‌కేర్ యూనిట్‌లో వుంది. పద్మనాభం బయట హాల్లో వున్నాడు.

అతని మనసునిండా ఎన్నెన్నో అనుమానాలు. భయాలు... వంటిమీద నిద్రలేదు. భగవంతుడిని ప్రార్థిస్తూనేవున్నాడు. తెల్లవారింది. రాంబాబుకు ప్రమాదం తప్పిపోయిందనుకున్నాడు. ఇన్‌టెన్సివ్ కేర్ యూనిట్‌నుంచి మామూలువార్డుకు మార్చారు.


'సరస్వతీ.. నన్ను క్షమించు. ఎందుకో నీకు తెల్సు. నాకు తెల్సు. నేను వట్టి మూర్ఖుడిని. ఎందుకూ పనికిరానివాడిని. ఒప్పుకుంటున్నాను. మన బిడ్డను నేనే చేజేతులా చంపుకుంటుంటే నువ్వు అడ్డంపడి బ్రతికించావు. కానీ నాకంతా ఆశ్చర్యంగా వుంది. ఈ హాస్పిటల్‌లోకి మహామహా వాళ్లకు ప్రవేశం వుండదే. మరి నువ్వు ఎలా వచ్చావు? బిడ్డకు నెమ్మదించాక మనం ఇక్కడినుంచి బయటపడడం ఎలాగ?'

'ఆ ప్రశ్నలని ఊళ్లో పెద్దరెడ్డిగారిని, మరో ఎనిమిదిమందిని అడగండి. వాళ్లే నా బిడ్డకు ప్రాణం పోసిన దేవుళ్లు'

ఆ క్షణంలో పద్మనాభంలోని 'మనిషిలో మనిషి' మరణించాడు.

మనిషిగా మారిన పద్మనాభం ప్రశాంతంగా చిరునవ్వు నవ్వేడు.

# నమ్మలేని నిజం



మన రాష్ట్ర సెక్రటేరియట్‌గానీ, ఇతర ప్రభుత్వ ఆఫీసుల్లోగానీ, ప్రజలకు ఉద్యోగులు ఎలాంటి ప్రాముఖ్యత ఇస్తారో మనకందరకూ తెలుసు. అయితే ఇందుకు భిన్నంగా అహ్మదాబాద్‌లోని గుజరాత్ హౌసింగ్ బోర్డుకు చెందిన ఆఫీసులో ఈ వేసవిలో మనం నమ్మలేని వింత ఒకటి జరిగింది. వేసవిలో ఎండలోంచి ఆఫీసులోకి అడుగుపెట్టిన ప్రజలందరికీ ... ఆ ఆఫీస్ మెసెంజర్ చల్లటి నీటి గ్లాసుతో స్వాగతం చెప్పారంటే... మీరు నమ్మగలరా? ఇది నిజంగా అతి అరుదైన అనుభూతి!! థాంక్స్ టూ దట్ ఆఫీస్! కీపిటప్ సర్!!

- జూపిటర్